జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త
తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి వెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

ఆదివారం | 21-07-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 78 పేజీలు: 8 వెల: రూ.7


# ముంపులోనే.. పంటపొలాలు



* జిల్లాలో విస్తారంగా వర్షాలు * గోతులుగా మారిన రహదారులు * తీరం దాటిన తుఫాన్ * వర్షం తగ్గడంతో ఊపిరిపీల్చుకున్న జిల్లావాసులు * నష్టపరిహారం అంచనాలో వ్యవసాయాధికారులు





**శ్రీకాకుళం, జులై 20 (వార్త):**గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జిల్లాలోని వేలాది పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. రహదారులు అధ్వానంగా మారాయి. బంగాళఖాతంలో తుఫాన్ ఒడిశాలో తీరం దాటడంతో జిల్లావాసులు ఊపిరిపీల్చుకున్నారు. శనివారం ఉదయం పదిగంటల తర్వాత వర్షాలు తగ్గుముఖం పట్టాయి. జిల్లా వ్యాప్తంగా 611 హెక్టార్లలో వరి నాట్లు ముంపునకు గురైనట్లు వ్యవసాయశాఖ నిర్ధారించింది. వ్యవసాయ శాఖాధికారి శ్రీధర్‌తో పాటు మండల వ్యవసాయాధికారులు పంటనష్టాల లెక్కింపులో నిమగ్నమయ్యారు. వరి పంట 611హెక్టార్లు ముంపునకు గురైందని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. నారు మడిలో నీరు లేకుండా చూడాలని రైతులకు సూచించారు. శ్రీకాకుళం నుంచి ఆమదాలవలస రోడ్డుపై నీరు నిల్వడంతో రహదారి అధ్వానంగా మారింది. ఎల్ఎన్‌పేట ప్రధాన రహదారిపై నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. హుటాహుటిన తహశీల్దార్ స్పందించి రోడ్డుపై నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టారు. ఆమదాలవలసలో రైల్వేఅండర్ టర్నల్ వద్ద భారీగా వర్షపునీరు నిలిచిపోయింది. కళింగపట్టణం, బారువ, బందరువానిపేట, కొవ్వాడ తీరాల వద్ద సముద్రం ముందుకువచ్చింది. ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెం గ్రామానికి చెందిన సూరాడ లక్ష్మణ(43) శనివారం సముద్రపు ఒడ్డున చేపలు పడుతుండగా, కెరటాల తాకిడికి గురై మృతి చెందాడు.



## పంట నష్టం వాటిల్లకుండా చర్యలు: మంత్రి అచ్చెన్నాయుడు



**టెక్కలి:** ముంపునకు గురైన పంటలకు నష్టం వాటిల్లకుండా చర్యలు చేపట్లాని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సంబంధిత అధికారులకు ఆదేశించారు. వ్యవసాయ, ఉద్యాన యూనివర్సిటీ శాస్త్రవేతల సలహాలు ఎప్పటికప్పుడు రైతులకు అందేలా చూడాలన్నారు. ఏ మేరకు పంట నష్టం జరిగిందన్న దానిపై వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి నివేదిక ఇవ్వాలన్నారు. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

### శ్రీకాకుళం జాయింట్ కలెక్టర్‌గా
# ఫార్మాన్ అహ్మద్‌ఖాన్

* సీఆర్‌డీఏకు నవీన్ బదిలీ * ఆర్థిక శాఖ ఉప కార్యదర్శిగా టెక్కలి సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ * రాష్ట్రవ్యాప్తంగా 63 మంది ఐఏఎస్‌ల బదిలీ

**శ్రీకాకుళం, జులై 20(వార్త):** రాష్ట్రంలో భారీగా ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులిచ్చింది. వీరిలో ఇప్పటికే బదిలీ అయ్యి పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న అధికారులు కొందరు ఉండగా, ప్రస్తుతం పనిచేస్తున్న స్థానాల నుంచి బదిలీ అయిన వారు అధికంగా ఉన్నారు. ఒకేసారి 63 మందికి స్థానచలనం కలిగింది. శ్రీకాకుళం జిల్లాకు సంబంధించి ఇక్కడి జాయింట్ కలెక్టర్‌గా ఉన్న మల్లారపు నవీన్‌ను సీఆర్‌డీఏ విభాగానికి బదిలీ చేశారు. కొత్త జేసీగా ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌ను నియమించారు. అలాగే టెక్కలి సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ కూడా బదిలీ అయ్యారు. ఆయనను ప్రభుత్వ ఆర్థికశాఖ ఉప కార్యదర్శిగా నియమించారు. కాగా, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ 2020 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన వ్యక్తి. ఈయన నెల్లూరు అసిస్టెంట్ కలెక్టర్‌గా, చింతూరు ఐటీడీఏ పీవోగా పనిచేశారు. అన్నమయ్య జిల్లా రాజంపేట సబ్‌కలెక్టర్‌గా



విధులు నిర్వహించారు. ఆతర్వాత పదోన్నతిపై అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు.

### సరికొత్త ఫీచర్లతో..
# ఏపీఈపీడీసీఎల్ మొబైల్ యాప్

* అదనపు రుసుం చెల్లించనక్కర్లేదు * యాప్‌కు సర్వీస్, ఆధార్‌ను అనుసంధానం చేసుకోండి * ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ క్రిష్ణమూర్తి

**శ్రీకాకుళం, జులై 20(వార్త):** ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) 'ఈస్టర్న్ పవర్' మొబైల్ యాప్ ను సరికొత్త ఫీచర్లతో వినియోగదారులకు అందుబాటులోకి తీసుకువచ్చిందని శ్రీకాకుళం సర్కిల్ సూపరెంటెండింగ్ ఇంజనీర్ ఎన్.క్రిష్ణ మూర్తి శనివారం పేర్కొన్నారు. గూగుల్ ప్లే స్టోర్ నుంచి 'ఈస్టర్న్ పవర్' మొబైల్ యాప్ డౌన్లోడ్ చేసుకొని వినియోగదారుని 16 అంకెల సర్వీసు నెంబర్ నమోదు చేసుకోవడం ద్వారా మొబైల్ యాప్ సేవలను పొందవచ్చన్నారు. 'బిల్ పే' ఆప్షన్ ద్వారా ద్వారా విద్యుత్ బిల్లులను ఎటువంటి అదనపు రుసుము లేకుండా అత్యంత సులభతరంగా చెల్లించవచ్చన్నారు. అంతేకాకుండా వినియోగదారుని సర్వీసుకు సంబంధించిన విద్యుత్ వినియోగం, బిల్లు వివరాలు, బిల్లు చెల్లింపు, విద్యుత్ సరఫరా పరిస్థితి వివరాలు తెలుసుకోవచ్చన్నారు. 'మై యుసెజ్' ఆప్షన్ ద్వారా విద్యుత్ మీటర్‌లో ఉన్న రీడింగ్ ప్రకారం కేవలం ప్రస్తుత వినియోగపు యూనిట్ల సంఖ్యను నమోదు చేయడం ద్వారా విద్యుత్ బిల్లును వినియోగదారులే యాప్ ద్వారా లెక్కించుకోవచ్చన్నారు. యాప్ ద్వారా ఆధార్ నంబర్‌కు విద్యుత్ సర్వీసు ను అనుసంధానం చేసుకోవడంతోపాటు విద్యుత్ సంబంధిత సమస్యలను ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. పేటీఎం, ఫోన్ పే, జీ పే తో సహా ఇతర యూపీఐ యాప్ ల ద్వారా బిల్లులు నేరుగా చెల్లించే విషయమై ఆర్బీఐ అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ పాత విధానంలోనే నేరుగా పోన్ పే, పేటీఎం, జీ పేల ద్వారా వినియోగదారులు బిల్లులు చెల్లించేందుకు వీలుగా బ్యాంకులతో సంప్రదింపులు జరుపుతున్నామని ఎస్ఈ ఎన్.క్రిష్ణమూర్తి తెలిపారు. సంస్థ వెబ్సైటు www.apeasternpower.com నుంచి కూడా బిల్లులు చెల్లించవచ్చన్నారు. ఏపీఈపీడీసీఎల్ మొబైల్ యాప్ లో గాని లేదా సంస్థ వెబ్సైటులో గాని బిల్లులు చెల్లించేటప్పుడు వినియోగదారులు తమ ఫోన్ పే, జీ పే, పే టిఎం, ఇతర యూపీఐ యాప్స్ తో పాటు నెట్ బ్యాంకింగ్, డెబిట్, క్రెడిట్, వాలెట్స్, క్యాష్ కార్డ్స్ కూడా వాడుకోవచ్చని ఎస్ఈ తెలిపారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం





## చట్టాలపై అవగాహన అవసరం

**జలుమూరు, జులై 20(వార్త):** మహిళలకు చట్టాలపై అవగాహన ఉండాలని తహశీల్దార్ సీహెచ్ నాగమ్మ, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు అన్నారు. జలుమూరు మండల పరిషత్ కార్యాలయంలో మహిళలపై లైంగిక వేధింపులు-చట్టాలు అనే అంశంపై స్త్రీ సంక్షేమ శాఖ నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో వారు మాట్లాడారు. విద్యార్థినుల నుంచి ఉద్యోగం, పని చేసే చోట ఎవరైనా వేధింపులకు గురైతే సంబంధిత అధికారితోపాటు పోలీసులు సహాయం తీసుకోవాలన్నారు.

# వేట సాగదు..
# పూట గడవదు!

*** గ్రామాల్లో ఖాళీగా ఉన్న కొందరు మత్స్యకారులు * మరికొందరు వలసబాట * మత్స్యకారులకు స్థానికంగా ప్రభుత్వం తగిన సౌకర్యాలు కల్పించక పోవటమే కారణం * షెడ్యూల్డ్ తెగల జాబితాలో చేర్చాలని డిమాండ్ * ప్రభుత్వాలు మారుతున్నా మారని మత్స్యకారుల బతుకులు**







**వజ్రపుకొత్తూరు, జులై 20(వార్త):** తరతరాలుగా సాగర తీరంలో చేపల వేటపై బతుకు బాట సాగిస్తున్న మత్స్య కారుల బతుకులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అన్న చందంగా ఉన్నాయి. ప్రభుత్వాలు ఎన్ని మారినప్పటికీ మత్స్యకారుల తలరాతలు మాత్రం మారడం లేదు. స్థానికంగా ఫిషింగ్ హార్బర్‌లు, ఫిష్ ల్యాండింగ్ జట్టీలు, కోల్డ్ స్టోరేజ్‌లు, మినీ ఆయిల్ బంక్‌లు, మత్స్యకారులు వేట అనంతరం వలలు అల్లుకునేందుకు వీలుగా విశ్రాంతి షెడ్లు, తీరంలో చేపలు ఎండ బెట్టు కునేందుకు వీలుగా ప్లాట్ ఫామ్స్, కార్గో వంటి బస్ సదుపాయాలు కల్పించాలని మత్స్యకారులు డిమాండ్ చేస్తున్నారు. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మృతి చెందిన మత్స్యకారుని కుటుంబానికి పోస్ట్ మార్టం లేకుండా 15లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని, నాటు తెప్పలు, ఇంజిన్ తెప్పలు, ఇంజిన్ బోట్లు కలిగి ఉన్న మత్స్యకారులంత మందికి భరోసా అందివ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఇవన్నీ అనుకూలంగా ఉన్నప్పుడే మత్స్యకారుల వలసలు నివారించవచ్చని ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఎన్నో ఏళ్ల నుంచి డిమాండ్ ఉంది. ఎన్నికల ముందు ఎస్టీ జాబితాలో చేరుస్తామని హామీలిచ్చిన నాయకులు ఆ తర్వాత పట్టించుకోవడం లేదు. కూటమి ప్రభుత్వమైనా తమను ఎస్టీ జాబితాలో చేర్చాలని గంగపుత్రులు కోరుతున్నారు.




### జర్నలిస్ట్ నాయకుడు 'కూన'
## హఠాన్మరణం
### దిగ్భ్రాంతి, సంతాపం వ్యక్తం చేసిన ప్రముఖులు



**శ్రీకాకుళం క్రైం, జులై20(వార్త):** ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ జాతీయ కౌన్సిల్ సభ్యులు, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కూన పాపారావు (63) శుక్రవారం దాదాపు అర్ధరాత్రి సమయంలో గుండెపోటుతో స్థానిక ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో కన్నుమూశారు. గత 20ఏళ్ల నుంచి జర్నలిస్టుగా ఉన్న ఆయన, యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా కూడా పనిచేశారు. అతనికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. శ్రీకాకుళం రూరల్ మండలంలోని కాలింగ మాన్నయ్యపేటలో, మధ్య తరగతి వ్యవసాయ కుటుంబంలో జన్మించిన పాపారావు, ఎక్కువకాలం, ప్రస్తుత పార్వతీపురం మన్యం జిల్లాలోని పాలకొండ నుంచి 'ఆంధ్రప్రభ' విలేకరిగా పనిచేశారు. కులాంతర వివాహం చేసుకొని ఆదర్శవంతమైన జీవితాన్ని గడిపిన ఆయన, ఏకైక కుమార్తెకు కూడా కులాంతర వివాహం జరిపించారు. కుమారుడిని అమెరికాలో చదివించారు. కొద్ది రోజుల్లో చండీగఢ్ లో జాతీయ కౌన్సిల్ సమావేశాలు జరగనున్న సందర్భంలో, కౌన్సిల్ సభ్యుడైన పాపారావు మరణం దిగ్భ్రాంతిని కలిగించిందని ఐజేయు అధ్యక్షుడు కె. శ్రీనివాసరెడ్డి, సెక్రటరీ జనరల్ బలివీందర్ సింగ్ జమ్ము ఒక ప్రకటనలో తెలిపారు. ఫోన్లో శనివారం ఉదయం పాపారావు భార్యతో వారు మాట్లాడి సానుభూతిని, సంతాపాన్ని తెలిపారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఐవీ సుబ్బారావు, చందు జనార్దన్ నాయుడు, ఐజేయు జాతీయ కార్యదర్శి డి సోమ సుందర్, స్మామ్నా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నల్లి ధర్మారావు, సిహెచ్ రమణారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎంవి మల్లేశ్వరరావు సంతాపాన్ని ప్రకటించారు. ఈనెల 28వ తేదీన, పలాసలో జరిగే యూనియన్ 31వ మహాసభల ప్రాంగణానికి కూన పాపారావు పేరు పెడుతున్నట్టు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చింతాడ అప్పలనాయుడు, మహరణ ప్రకటించారు. ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల సంఘం జిల్లా కన్వీనర్ రామారావు, స్మామ్నా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సింగూరు శ్రీనివాసరావు, కుంచె చిన్నారావు, గరిమెళ్ళ ప్రెస్ క్లబ్ కార్యదర్శి ఎస్ నవచైతన్య, కోశాధికారి చౌదరి సత్యనారాయణ, విశాలాంధ్ర విశాఖపట్నం బ్రాంచ్ మేనేజర్ నరసింహులు, అరసం జిల్లా కార్యదర్శి చింతాడ కృష్ణారావు వేర్వేరుగా సంతాపాలు ప్రకటించారు.

### ఎమ్మెల్యే కూన, మాజీ మంత్రి ధర్మాన సంతాపం

తనకు దగ్గర బంధువైన కూన పాపారావు మరణం, తనకు తీరని లోటు అని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. పాపారావు మృతికి సంతాపం ప్రకటిస్తూ, అతని కుటుంబానికి అండగా ఉంటాను అన్నారు. శ్రీకాకుళం శాసనసభ నియోజకవర్గ పరిధిలో, పాపారావు స్వగ్రామం ఉందని, తన పట్ల వారి కుటుంబానికి, బంధువులకు చాలా అభిమానం ఉందని రెవెన్యూ శాఖ మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు మరో ప్రకటనలో గుర్తు చేసుకుంటూ, అతని మరణించారన్న సమాచారం దిగ్భ్రాంతిని కలిగించిందని, వారి కుటుంబానికి సానుభూతిని వ్యక్తం చేస్తూ, సంతాపం తెలిపారు. సీనియర్ జర్నలిస్ట్, ఇస్కఫ్ జిల్లా అధ్యక్షులు జీవి నాగభూషణ్, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చాపర సుందర్ లాల్, జిల్లా కార్యదర్శి వెంకటరమణ, సిక్కోలు జలసాధన సమితి దుప్పల రవీంద్రబాబు, ప్రజా న్యాయవాది బొడ్డేపల్లి మోహన్ రావు తదితరులు పాపారావు మరణం పట్ల ఆవేదనను, సంతాపాన్ని ప్రకటించారు.

# ముంపులో పంటపొలాలు



**గార, జులై20(వార్త):** బంగాళఖాతంలో అల్పపీడనం తుఫాన్‌గా మారడంతో గార మండలంలో మూడు రోజులుగా వర్షం కురుస్తోంది. మండలంలోని పలు గ్రామాల్లో పంట పొలాలు ముంపులో ఉన్నాయి. వరి మొక్క దశలో ఉండడంతో పొలంలో నీరు నిల్వ ఉండకుండా రైతులు జాగ్రత్తలు చేపడుతున్నారు.

### నేలకొరిగిన పూరి గుడిసెలు



**పోలాకి, జులై 20(వార్త):** భారీ వర్షాలతో పోలాకి మండలం గుప్పిడిపేట గ్రామంలో పూరి గుడిసెలు నేలమట్టం అయ్యాయి. గత రెండు సంవత్సరాల కిందట ఇళ్లు కాలిపోవడంతో మట్టితో స్థానిక మత్స్యకారులు నిర్మాణాలు చేసుకున్నారు. ప్రస్తుత వర్షాలకు ఈ ఇళ్లు నానిపోయి నేలమట్టమయ్యాయి. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఆర్థికంగా ఆదుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు.

### పంట పొలాల పరిశీలన



**నరసన్నపేట, జులై 20(వార్త):** మండలంలోని బొరుగువలస, లుకలాం గ్రామంలోని పంట పొలాలను మండల వ్యవసాయ శాఖ అధికారి సునీత శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున జాగ్రత్తలు పాటించాలన్నారు. వరిమడుల్లో ఎక్కువ నీరు లేకుండా చూసుకోవాలన్నారు. వరినారుకు ఏపుగా పెరిగేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఆమె వెంట వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

## యుద్ధ ప్రాతిపదికన ముంపు నివారణకు చర్యలు

ఎల్ఎన్‌పేట, జులై 20 (వార్త): అల్పపీడన ప్రభావంతో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు కారణంగా ఎల్ ఎన్ పేట జంక్షన్, రోటరీనగర్‌లో పలు ఇళ్లు ముంపునకు గురయ్యాయి. విషయం తెలుసుకుని జిల్లా బిజెపి అధికార ప్రతినిధి వాన సోమేశ్వరరావు ఆయా ఇళ్లు పరిశీలించి వెంటనే స్థానిక తహశీల్దార్ రాణి అమ్మాజీ దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే ఆమె స్పందించి సంబంధిత సిబ్బందితో రోటరీ నగర్ కు వెళ్లి జెసిబితో గట్టును ఏర్పాటు చేసి గ్రామంలోకి నీరు వెళ్లనీయకుండా చేశారు. అలాగే అలికాం బత్తిలి రోడ్డుపై కూడా నీరు ప్రవహించకుండా చర్యలు చేపట్టారు.





## 70 మందికి నేత్ర వైద్య పరీక్షలు

**నరసన్నపేట, జులై 20(వార్త):** ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉచిత నేత్ర వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని నేత్ర నిపుణుడు బాలగంగాధర్ రాజు తెలిపారు. శనివారం నరసన్నపేట మండలం యారబాడు సచివాలయంలో నేత్ర పరీక్షలు చేశారు. మండలంలో 70 మందికి నేత్ర శస్త్రచికిత్సలకు ఎంపిక చేశామన్నారు. కంటి రోగాలపై నిర్లక్ష్యం చేయొద్దన్నారు. ఎవరైనా నిర్లక్ష్యం చేస్తే కంటి చూపు కోల్పోయే అవకాశం ఉందని తెలిపారు. నేత్ర పరీక్షల అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## వాబ పాఠశాలను తెరవండి

**సారవకోట, జులై 20(వార్త):** అన్నుపురం పంచాయతీలోని వాబ గ్రామంలోని పాఠశాలను గత ప్రభుత్వం మూసివేయించింది. ఈ పాఠశాలను పున: ప్రారంభించాలని సర్పంచ్ తాడేల భీమారావు అధికారులను, పాలకులను కోరారు. నాలుగు సంవత్సరాలుగా ఈ పాఠశాల మూతపడడంతో మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న సారవకోట పాఠశాలకు ఇక్కడి నుంచి విద్యార్థులు రోజూ వెళ్లివస్తున్నారన్నారు. విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మళ్లీ పాఠశాలను ప్రారంభించాలని సర్పంచ్ కోరుతున్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## యువకుని రక్తదానం



**మందస, జులై 20 (వార్త):** మందస మండలం నారాయణపురం గ్రామానికి చెందిన ఆర్.రూపావతి అనే గర్భిణీకి ఏ పాజిటివ్ బ్లడ్ అవసరం కావడంతో శ్రీ పవనపుత్ర సేవాసంస్థ ను సంప్రదించారు. సంస్థ సభ్యుడు మందస మండలం జిల్లండ గ్రామానికి చెందిన కొర్రాయి దుర్యోధన వెళ్ళి బ్లడ్ ను దానం చేశారు. సంస్థ సభ్యులు కర్రి పురుషోత్తం, కొల్లి ప్రవీణ్ సహకారం అందించారు. రూపావతి పండంటి ఇద్దరు పాపలకు జన్మనిచ్చింది. శ్రీ పవనపుత్ర సేవా సంస్థ ద్వారా రక్తదానం చెయ్యాలంటే మీ పేరు, బ్లడ్ గ్రూప్, గ్రామం 8985801148 నెంబర్ కి వాట్సాప్ ద్వారా సంప్రదించాలని కోరారు.

# విస్తృతంగా వాహనాల తనిఖీ

**శ్రీకాకుళం క్రైం, జులై 20(వార్త):** శ్రీకాకుళం జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు పోలీసులు శనివారం జిల్లావ్యాప్తంగా వాహనాలను విస్తృతంగా తనిఖీ చేశారు. రోడ్డు భద్రతా నియమాలు ఉల్లంఘించిన వారికి, రికార్డులు లేనివారికి, హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపిన వారికి అపరాధ రుసుం విధించారు. విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తూ అక్రమ రవాణాను అరికట్టేందుకు వాహనాలు తనిఖీ చేశారు. ట్రాఫిక్ నిబంధనలపై వాహనచోదకులకు అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, ట్రిపుల్ రైడింగ్ చేయకూడదని, మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని, మద్యం తాగి వాహనాలు నడపకూడదన్నారు.















## రిమ్స్‌కి నాలుగు వీల్‌చైర్లు వితరణ

**శ్రీకాకుళం టౌన్, జులై 20(వార్త):** శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, కళాశాలకి నాలుగు వీల్ చైర్స్‌ను బ్యాంక్ ఆఫ్ బరోడా తరపున బ్రాంచ్ మేనేజర్లు ఉషాకిరణ్, రాజేంద్ర దీపక్ అందజేశారు. బ్యాంక్ ఆఫ్ బరోడా 117వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం వీటిని అందించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆద్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ సనపల నరసింహమూర్తి మాట్లాడుతూ నిరుపేద రోగులకి ఉపయోగపడే వీల్ చైర్స్ ను రిమ్స్ ఆసుపత్రి,మెడికల్ కళాశాలలకి బ్యాంక్ ఆఫ్ బరోడా తరపున మేనేజర్లు ఇవ్వడం ప్రశంసనీయమన్నారు. పబ్లిక్, ప్రైవేటు రంగ సంస్థలు, దాతలు ఇటువంటి సేవా కార్యక్రమాలను నిర్వహించేందుకు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో రిమ్స్ ఆర్ఎంఓ డాక్టర్ సుభాషిణీ, డిప్యూటీ సూపరిటెండెంట్ డాక్టర్ పార్థసారథి, డాక్టర్లు షర్మిల, అనురాధలు పాల్గొన్నారు.

### రూ.8.30 కోట్ల స్త్రీనిధితో..
## మహిళలకు ఆర్థిక భరోసా



**మందస, జులై 20 (వార్త):** మహిళల ఆర్థిక అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని స్త్రీనిధితో మహిళలకు ఆర్థిక భరోసా కల్పించడం జరుగుతుందని, సద్వినియోగపరుచుకోవాలని మందస ఏపిఎం గొడబ ప్రసాదరావు చెప్పారు. విలేకరులతో ప్రసాదరావు మాట్లాడుతూ స్త్రీనిధి రుణాలు కింద రూ. 8.30కోట్లు 2023-24 ఆర్థిక సంవత్సరంలో మందస మండలంలోగల 372 స్వయం సహాయక సంఘాలలో గల 1198 మంది డ్వాక్రా సభ్యులకు రుణాలు అందించామన్నారు. ఈ రుణాలు తీసు కొన్నస్వయం సహాయక సంఘాల సభ్యులు ఆర్థికంగా సుస్థిర జీవనోపాదులు కల్పిం చుకున్నారని తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో స్త్రీనిధి రుణాల్లోమహిళలకు జీవనోపాధులు కల్పించడం ద్వారా శ్రీకాకుళం జిల్లాలో మందస మండలం ప్రధమ స్థానంలో నిలిచిందని తెలిపారు. మరల ఈ ఆర్థిక సంవత్సరం 2024-25 లో కూడా స్త్రీనిధి రుణాలు 8 కోట్లు లక్ష్యంగా ఉండగా ఇప్పటికే రూ.1కోటి రూపాయలు మహిళా సభ్యులకు స్త్రీనిధి రుణాలుఅందించామని, మిగతా 7కోట్లు రూపాయలును కూడా మహిళా సభ్యుల అవస రాన్ని బట్టి వాళ్లకు స్త్రీనిధి రుణాలు అందజేయుటకు ఇప్పటికే ప్రణాళికలు తయారు చేసుకు న్నామని తెలిపారు. స్త్రీనిధి రుణాలు 11శాతం వడ్డీతో నేరుగా మహిళా సభ్యులకు అందజేయడంజరుగుతుందని, స్త్రీనిధితో మహిళలకు ఆర్థిక భరోసా కలుగుతుందని తెలిపారు.

### వీర జవాన్ కుటుంబానికి
## ఆర్మీ అధికారుల తక్షణ సాయం




**సంతబొమ్మాళి, జులై20 (వార్త):** జమ్మూ సరిహద్దు ప్రాంతంలో ఉగ్రవాదులు దాడిలో అసువులు బాసి వీర మరణం పొందిన డొక్కరి రాజేష్ కుటుంబానికి ఆర్మీ అధికారులు శనివారం తక్షణ సాయంగా ఆర్థికసాయం చెక్కును అందించారు. ఈ మేరకు గోపాల్ పూర్ ఆర్మీ ఎయిర్ డిఫెన్స్ సెంటర్ కమాండింగ్ ఆఫీసర్ ఏఎస్ బద్వాల్ మేజర్ రౌట్ చెట్లతాండ్ర గ్రామం వచ్చి కుటుంబాన్ని పరామర్శించారు. వీర జవాన్ కుటుంబానికి తాము అండగా ఉంటామని ప్రభుత్వం నుంచి రావాల్సిన ప్రతీ ప్రయోజనం త్వరగా అందేవిధంగా చూస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం ఆర్డీఓ రంగయ్య, టెక్కలి డిఎస్ పి బాల చందర్, జిల్లా మాజీ సైనికుల అధ్యక్షుడు పూర్ణ చంద్రరావు కటకం, పైడి మురళి, తాండ్ర జనార్దన్, టెక్కలి మాజీ సైనికుల అధ్యక్షుడు గొనప సోమేష్, కంచరాన మన్మధరావు , సర్పంచ్ పంగా ఆసిరి నాయుడు పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం

### రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు

**శ్రీకాకుళంటౌన్, జులై 20(వార్త):** జిల్లాను జాయింట్ యాక్షన్ ప్లాన్ ద్వారా ప్రభుత్వ శాఖల సహాయ సహకారాలు, సమన్వయం, ఉమ్మడిభాగస్వామ్యంతో డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చి దిద్దడానికి విస్తృత చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, సభ్యుడు గొండు సీతారాం తెలిపారు. శనివారం కలెక్టరేట్లో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్,జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ సారథ్యంలో బాలలు మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలు నియంత్రణ చర్యలు గురించి జిల్లాలో బాలలతో పనిచేస్తున్న కీలక ముఖ్య శాఖలైన బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, పోలీసు శాఖ, విద్యా శాఖ, ఎక్సైజ్ శాఖ, సాంఘిక సంక్షేమశాఖ, రెవెన్యూ, పంచాయత్ రాజ్, మున్సిపల్ శాఖ, సమాచార, పౌర సంబంధాల శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ, వైద్య,ఆరోగ్య శాఖ, రైల్వే మొదలగు శాఖలకు సంబంధించి ఉన్నతాధికారులతో జిల్లా రెవెన్యూ అధికారి గణపతి రావు సారథ్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో జిల్లాలో డ్రగ్స్ నియంత్రణ కోసం చేపడుతున్న కార్యక్రమాలను వివిధ శాఖల అధికారులు ద్వారా పూర్తి సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్ నియంత్రణకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కొంతమంది రాష్ట్ర మంత్రులుతో కమిటీ వేసి చర్చలు, నియంత్రణ చర్యలు కోసం ప్రణాళికలు రూపొందించడం జరిగిందని తెలిపారు. ప్రత్యేక కౌన్సిలింగ్ విదానాలు, పునరావాస కేంద్రాలు, డీ ఎడిక్షన్ కేంద్రాల ఏర్పాటుతో పాటు పాఠశాలలు, కళాశాలలు, వివిధ పునరావాస కేంద్రాలుచ వసతి గృహాల్లో మనస్తత్వ వేత్తల నియామకం కోసము ప్రభుత్వం చర్యలు చేపట్టాలని అధిక శాతం అధికారులు కోరడం జరుగుతుందని తెలిపారు. అలాగే విద్యా శాఖ, పోలీసులు, సెబ్ అధికారులు వీటి నిర్మూలనపై విస్తృత అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. రైల్వే శాఖాధికారులు గవర్నమెంట్ రైల్వే పోలీసు అధికారుల సమన్వయంతో పిల్లలతో మాదక ద్రవ్యాలను సరఫరా చేసే వ్యక్తుల మూలాలపై దృష్టి కేంద్రీకరించాలని అన్నారు. అలాగే ఔషధ నియంత్రణాధికారులు మత్తును కలిగించే వివిధ ఔషధాలను పిల్లలకు అమ్మకుండా కట్టుదిట్టమైన ఆదేశాలు జారీ చేయాలని అన్నారు. సమాచార పౌర సంబంధాల శాఖాధికారులు ఎలక్ట్రానిక్,ప్రింట్ మీడియా ద్వారా మాదక ద్రవ్యాల వినియోగం వల్ల పిల్లల భవిష్యత్ ఏ విధంగా ఛిద్రం అవుతుందో డాక్యుమెంటరీలు రూపంలో విస్తృత ప్రచారం చేపట్టాలని సూచిస్తున్నట్లు చెప్పారు. ఇటువంటి సమీక్ష సమావేశాలు రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతంగా నిర్వహించి ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ పిల్లలకు చక్కని ఫలితాలు అందించే దిశగా అడుగులు వేస్తున్నట్టు అప్పారావు, సీతారాంలు చెప్పారు. సమావేశంలో జిల్లా స్త్రీ,శిశు సంక్షేమ శాఖ ప్రోజెక్ట్ డైరెక్టర్ బి.శాంతిశ్రీ సిడబ్లూసి చైర్ పర్సన్ శ్రీ లక్ష్మీ,జిల్లా బాలల సంరక్షణ అధికారి కే.వి.రమణ,సెబ్.ఎక్సైజ్,జిల్లా పరిషత్, విద్యాశాఖ, ఆరోగ్య ,మునిసిపల్, సమాచార పౌర సంబంధాల, రైల్వే, ఆర్టీసీ, సాంఘిక సంక్షేమ శాఖ, అటవీ శాఖ, ప్రభుత్వేతర సంస్థలు ప్రతినిధులు పాల్గొన్నారు.






## పూర్వ విద్యార్థుల దాతృత్వం

**మందస, జులై20 (వార్త):** మందస పట్టణంలోని శ్రీరాజా శ్రీనివాస స్మారక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఐకానిక్ భవనాల పునఃనిర్మాణానికి పూర్వ విద్యార్థులు ముందుకు వస్తునే ఉన్నారు. ఈ విద్యాలయంలో చదువుకున్న విద్యార్థులు దాతృత్వం చూపిస్తున్నారు. 1996-97 సంవత్సరం విద్యార్థులు రూ.లక్షను పాఠశాల ముందు భాగం ఐకానిక్ భవనాల మరమ్మతులకు అందజేశారు. ఈ మొత్తాన్ని ఓల్డ్ బిల్డింగ్ రెనోవేషన్ ఫోరంనకు అందజేశారు. మరింత సాయాన్ని అందజేస్తామని ఆ బ్యాచ్ పూర్వ విద్యార్థులు తెలిపారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



**పలాస, జులై 20(వార్త):** గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, కుక్క కాటుకు, పాము కాటుకు మందులు అందుబాటులో ఉంచాలని డెంగ్యూ, మలేరియా వ్యాదులు ప్రబలకుండా గ్రామాల్లో ముందస్తు చర్యలు, అవగాహన కల్పించాలని సిబ్బందికి ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదేశించారు. ముఖ్యంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న వారి పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. శనివారం వైద్య సిబ్బంది ఏర్పాటు చేసిన సమావేశంలో పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## శ్రీనివాస్.. మరో నలుగురికి ప్రాణం పోశాడు

**రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

**సంతబొమ్మాళి, జులై 20 (వార్త):** సంతబొమ్మాళి మండలంలో గోవిందపురం పంచాయతీ జొన్నలపాడు గ్రామానికి చెందిన చల్లా శ్రీనివాస్(25) తాను చనిపోతూ మరో నలుగురికి ప్రాణం పోశాడని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఇటీవల రహదారి ప్రమాదంలో చల్లా శ్రీనివాస్ తీవ్రంగా గాయపడి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ మేరకు చిన్న వయస్సులో రహదారి ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శ్రీనివాస్ మృతి చాలా బాధాకరమని మంత్రి అచ్చెన్నాయుడు విచారం వ్యక్తం చేశారు. శ్రీనివాస్ తల్లిదండ్రులు తమ బిడ్డ అవయవాలను దానం చేయాలనే నిర్ణయంతో కిడ్నీ, గుండె, కాలేయంతో పాటు ఇతర అవయవాలను ఆసుపత్రికి అప్పగించారని తెలిపారు. శ్రీనివాస్ మృతి పట్ల సంతాపం తెలిపి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని మంత్రి తెలియజేశారు.

### ఉత్తరాంధ్ర సృజల స్రవంతికి..

# నిధులు కేటాయించండి

***పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనం.. ఉత్తరాంధ్ర**

***ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వరయ్య**

**పలాస, జులై 20(వార్త):** పాలకుల నిర్లక్ష్యానికి ఉత్తరాంధ్ర వెనుకబాటు తనమే ఒక నిదర్శనమని, ఉత్తరాంధ్ర అభివృద్ధి కావాలంటే వ్యవసాయమే ప్రధాన జీవనాధారమని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు గుజ్జల ఈశ్వరయ్య అన్నారు. శనివారం పలాసలో రైతు సంఘ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఈశ్వరయ్య మాట్లాడుతూ జిల్లాలో వంశధార, మహేంద్ర తనయ, బహుదా వంటి ప్రధాన నదులు ఉన్నప్పటికీ రైతాంగానికి సాగు నీరు అందించడంలో పాలకులు విఫలమయ్యారన్నారు. జిల్లాలో పెండింగ్లో ఉన్న ఆఫ్షోర్ రిజర్వాయర్ ప్రాజెక్ట్ను పూర్తి చేయాలన్నారు. రైతులకు అన్ని రకాల వ్యవసాయ రుణాలు ఎరువులు, పురుగుల మందులు, విత్తనాలపై 90 శాతం సబ్సిడీని ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. గత నాలుగు దశాబ్దాలుగా ఉత్తరాంధ్రా ప్రోజెక్టులు వెక్కిరిస్తున్నాయని, ఆఫ్షోర్ ప్రోజెక్టు నిర్వాసితుల సమస్యలు ఈ రోజుకి తీర్చలేకపోవడం ప్రభుత్వాల నిర్లక్ష్యం కనబడుతుందన్నారు. కేంద్రంలో బుల్డోజర్ సర్కారు రాష్ట్రంలో డబల్ ఇంజన్ సర్కారు ట్రబుల్ ఇంజన్ సర్కారులా మారకముందే ప్రోజెక్టులు పూర్తిచేసి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. ఈ జిల్లాలో జీడి పంటకు గిట్టుబాటు దక్కడం లేదని ఈ ప్రాంత జీడి రైతులు గత 40 సంవత్సరాలుగా వ్యాపారుల దగాకు గురి అవుతున్నారని, ఇప్పటికైనా జీడి పంటకు రూ.16000 గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజన రైతాంగం జీడి పంటకు పెట్టుబడి లేక సరైన రీతిలో పంట పండించుకోలేకపోతపన్నారని, వారికి వడ్డీలేని పంట రుణాలు కల్పించాలని డిమాండ్ చేశారు. నిరుపేదలు ఉపాధి కోసం భూ యజమానుల దగ్గర నుండి కౌలుకు తీసుకుని పంటలు పండిస్తున్నారు. మరి కొంతమంది ఎటువంటి సొంత భూమితో పాటు మరికొంత భూమిని కౌలకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నారు. భూ యజమానుల భూమితో పాటు దేవాదాయ, ధర్మాదాయ శాఖ సంబంధించిన భూములు సాగు చేసేవారు కూడా ఉన్నారు. మొత్తం వ్యవసాయ రంగంలో కౌలు రైతులే కీలకమైన భూమిక పోషిస్తున్నారన్నారు. కౌలు రైతులకు పాలక ప్రభుత్వాలు కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. కౌలు రైతులు సాగు చేస్తున్న దామాషాను బట్టి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచి సున్నా వడ్డీకే పంట రుణాలు అందించాలని,ప్రతి సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం అందించే పెట్టుబడి సాయాన్ని పెంచి ఎకరానికి 15000 చొప్పున భూములేని కౌలు రైతులకు పంట సాయం అందించాలని కోరారు. ఈ నెల 27,28,29 తేదీల్లో మదనపల్లి లో జరిగే రైతు సంఘ సమావేశాలకు జిల్లా నుంచి పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు. అనంతరం జిల్లా రైతు సంఘం కమిటీని ఎన్నుకున్నారు. ఆ సంఘ కన్వీనర్గా చాపర వేణుగోపాల్, కోకన్వీనర్గా అయినింటి లోకనాదం, సభ్యులుగా పి ఎర్రం నాయుడు, హనుమంతు శంకరరావు, సొర లక్ష్మణరావు,మెట్ట సింహాచలం,కొన్న రమణాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# కేంద్రీయ విద్యాలయం స్థల పరిశీలన

*** పాఠశాల నిర్మాణానికి దువ్వాడ సహకారం**

*** స్వచ్ఛందంగా సూదికొండ క్వారీ లీజ్ రద్దు చేసుకున్న దువ్వాడ**

*** అభినందించిన గౌతు శిరీష**

**పలాస, జులై 20(వార్త):** పలాస - కాశీబుగ్గ పరిధిలో కేంద్రీయ విద్యాలయం నిర్మించాలన్న ఎమ్మెల్యే గౌతు శిరీష సంకల్పం మేరకు శనివారం రెవెన్యూ అధికారులు స్థల పరిశీలనకు ఉపక్రమించారు. ఈ సందర్భంగా విషయం తెలుసుకున్న దువ్వాడ శ్రీకాంత్ ఈ విషయంపై ఆనందం వ్యక్తం చేస్తూ గత ప్రభుత్వంలో తనకు సూది కొండ ప్రాంతంలో సర్వే నెంబరు 51/1లో 3.560 హెక్టార్ల 10 సంవత్సరాల లీజును స్వచ్ఛందంగా రద్దు చేస్తూ ఆ ప్రాంతంలో కేంద్రీయ విద్యాలయం నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా లీజు రద్దు చేస్తూ శాసన సభ్యురాలు గౌతు శిరీష సమక్షంలో రెవిన్యూ అధికారులకు లేఖ అందజేస్తు ప్రాంతాన్ని సరండర్ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో నా పేరిట సూది కొండల్లో క్వారీ లీజు మంజూరు జరిగినప్పటికీ అప్పటి ప్రభుత్వంలో అధికార పార్టీ మద్దతుతో అక్కడ నాయకులే కొండను కొల్లగొట్టారని భవిష్యత్తులో ఇటువంటి పరిణామాలు జరగకుండా నా లీజును రద్దు చేసుకుంటున్నట్లు ప్రకటించారు. ఆ ప్రాంతంలో కేంద్రీయ పాఠశాల నిర్మాణం జరిగితే సూదికొండ ప్రాంతంలో ప్రభుత్వ భూములు కాపాడుటకు అవకాశం ఉంటుందని శ్రీకాంత్ పేర్కొన్నారు. శ్రీకాంత నిర్ణయాన్ని స్వాగతిస్తున్నానని శిరీష పేర్కొన్నారు. ఇటువంటి సహకారం నాయకుల నుంచి ఉంటే పలాస నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎస్ఎస్వివిఎస్ నాయుడు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ పి. నిరంజన్, మండల సర్వేయర్ వైవీ గిరి, టిడిపి నాయకులు విఠల్, గాలి కృష్ణ, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, మల్లా శ్రీనివాసరావు, కాళీ పాల్గొన్నారు.



## 30 వరకూ హాస్టల్స్ సందర్శన

**పలాస, జులై 20 (వార్త):** పలాస నియోజకవర్గంలోని హాస్టల్స్ను ఈనెల30 వరకూ సందర్శిస్తామని, అక్కడి సమస్యలను తెలుసుకుని ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకువెళతామని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సిహెచ్ రవి అన్నారు. పలు వసతి గృహాల్లో దుప్పట్లు, ట్రంకు పెట్టెలు, దోమల తెరలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. 8 నెలల నుంచి మెస్చార్జీలు చెల్లించడం లేదన్నారు. ఖాళీగా ఉన్న కుక్, కమాటి వార్డెన్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. ఈ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆగస్టు 6న చలో కలెక్టరేట్ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పలాస నియోజకవర్గం అధ్యక్ష, కార్యదర్శులు పవన్, గుణశేఖర్ జీవన్, జస్వంత్ పాల్గొన్నారు.

### ఘనంగా టీడీపీ యువనాయకుడు

# ఈశ్వరరావు జన్మదిన వేడుకలు



**మందస, జులై 20 (వార్త):** తెలుగుదేశం పార్టీ యువనాయకుడు, సంఘసేవకుడు ఔగాన ఈశ్వరరావు జన్మదిన వేడుకులు ఘనంగా జరిగాయి. మందస మండలంలోని సొండిపూడి గ్రామానికి చెందిన ఈశ్వరరావు సామాన్య కుటుంబంలో జన్మించి, అంచలంచెలుగా ఎదుగుతున్నారు. ఎన్నికల ముందు సుమారు 50 కుటుంబాలతో ప్రస్తుత ఎంఎల్ఏ గౌతు శిరీషా సమక్షంలో తెలుగుదేశంపార్టీలో చేరారు. పార్టీలో కీలకంగా వ్యవహరిస్తున్న ఆయన విజయంలో కూడా ఆయన మంచి పాత్ర పోషించారు. సామాజిక పరంగా మంచి పనులు చేయడంలో ముందుంటారు. పేదలకు, రోగులకు సాయం చేస్తుంటారు. దీంతో ఆయన జన్మదిన వేడుకలకు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు భావన దుర్యోధన, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రట్టి లింగరాజు, నాయకులు మామిడి తాతారావు, తమిరి భాస్కరరావు, ముదుమంచి నవీన్ కుమార్, ముంజేటి చంద్రశేఖర్, ఖగేశ్, చింతాడ లక్ష్మీనారాయణ, అల్లుమల నారాయణరావు, మామిడి కళ్యాణ్, మిస్క గణపతి, మద్ది సురేశ్, మద్ది సత్యం, కోనారి రామారావు తదితరులు హాజరై, పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. కాగా, స్నేహితులు, అభిమానులకు ఆయన విందు ఏర్పాటు చేశారు.



### రిమ్స్లో పోక్సో ప్రత్యేక

# వైద్య పరీక్షల గది ప్రారంభం

**శ్రీకాకుళం టౌన్, జులై 20 (వార్త):** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ఇటీవల జారీ చేసిన ఆదేశాలతో రిమ్స్ ఆసుపత్రిలో పోక్సో బాధిత బాలల కోసం శనివారం రిమ్స్లో ప్రత్యేక వైద్య పరీక్షల గదిని ఏర్పాటు చేశారు. ఈ గదిని శనివారం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, సభ్యులు గొండు సీతారాం, ఆసుపత్రి ఇన్చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ పార్వతి, ఆర్ఎంఓ డాక్టర్ సుభాషిణి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పార్థ సారథి, జిల్లా బాలల సంరక్షణ అధికారి కే.వి.రమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా అప్పారావు, సీతారాం మాట్లాడుతూ జిల్లాలో లైంగిక వేధింపులకు గురైన బాధిత బాలికల (పోక్సో కేసుల్లో) ప్రత్యేక వైద్య పరీక్షలకు అవసరమయ్యే ఓ.పి.సేవలు, ప్రత్యేక పడకలు, వైద్య పరీక్షల గదిని ఏర్పాటు చేయాలని ఈ ఏడాది ఆసుపత్రిని సందర్శించిన తాము ఆసుపత్రి అధికారులకు ఆదేశాలు జారీ చేసిన విధంగా త్వరిత గతిన ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు. గతంలో అత్యాచార, లైంగిక వేధింపులకు గురయ్యే ఆడపిల్లలకు ఇప్పటి వరకు సాధారణ ప్రసూతి వార్డుల్లో వైద్య పరీక్షలు, చికిత్సలు నిర్వహిస్తుండేవారన్నారు, దీంతో బంధువులు,వార్డుల్లో రోగులు,కొంతమంది సాటి రోగులు సూటిపోటు మాటలతో మానసిక క్షోభను కల్గిస్తుందడం బాలల హక్కుల ఉల్లంఘనలుగా భావించి అప్పట్లో తాము దీని ఏర్పాటుకు ఆదేశాలిచ్చినట్టు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల ప్రధాన ఆసుపత్రుల కేంద్రాల్లో ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. బాలల హక్కుల పరిరక్షణలో భాగంగా ఈ కేంద్రం ఏర్పాటుకు సహకరించిన జిల్లా కలెక్టర్, రిమ్స్ ఆసుపత్రి సూపరింటెండెంట్, ఆర్.ఎం.ఒ. పిల్లల వార్డ్ అధిపతికి రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ తరపున అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కొత్తకోట శ్రీనివాస్, మొదలవస వాసుదేవ కుమార్, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నీట మునిగిన పంటల పరిశీలన



**బూర్జ, జులై 20(వార్త):** మండలంలోని పనుకుపర్త గ్రామంలోని పంట పొలాలను వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు శనివారం పరిశీలించారు. తుఫాను కారణంగా మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిన వర్షాలకు పొలాలన్నీ నీట మునిగాయి. శనివారం సాయంత్రం తుఫాన్ తీరం దాటడంతో మునిగిన నారుమడులు, ఎద జల్లిన పొలాలను పరిశీలించారు. వర్షపునీరు ఆదివారం ఉదయానికి పొలాల నుండి బయటికి వెళ్ళిపోతుందని అంచనా వేశారు. వర్షపు నీటిలో 72 గంటల కంటే ఎక్కువ సమయం పంటలు మునిగి ఉంటే అధికంగా నష్టం జరుగుతుందని,ప్రస్తుతానికి రైతులు ఇబ్బంది పడాల్సిందేమీ లేదని రైతులకు ధైర్యాన్నిచ్చారు.ఈ వానలు వలన మండలంలో 11 గ్రామాల్లో 75 హెక్టార్లలో వరి పంట నీట మునిగిందని నివేదిక ఇవ్వడం జరిగిందని శ్రీనివాసరావు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారి శ్రీమతి డి వి రమణమ్మ, గ్రామ వ్యవసాయ సహాయకురాలు శ్రీమతి ఐ హేమలత, రైతులు దుప్పాడ భాస్కరరావు, మక్క అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## అప్రమత్తతతో వ్యవహరించాలి

**హిరమండలం, జులై 20(వార్త):** వర్షాలు పడుతున్నందున గ్రామాల్లో ప్రజలను అప్రమత్తత చేయాలని ఎంపీడీఓ స్వరూపా రాణి సూచించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరం లో సంబంధిత శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వంశధార పరివాహాక ప్రాంతాలతో పాటు లోతట్టు ప్రాంత ప్రజలకు అప్రమత్తత వ్యవహరించాలని ఆమె సూచించారు.గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని, వర్షాలు తగ్గుముఖం పట్టే వరకు స్థానికంగా ఉండాలని ఆమె సూచించారు.అలాగే అక్కరాపల్లి గ్రామ పరిధిలో సుమారు 15 ఎకరాల వరకు వరి పొలాలు ముంపునకు గురైనట్లు గుర్తించామన్నారు. అలాగే పరిసరాల పరిశుభ్రత వ్యవహరించి వ్యాధులు సంభవించకుండా చర్యలు చేపట్టాలని ఆమె సూచించారు.ఈమెతో పాటు ఉప తహశీల్దార్ వెంకటరమణ ఉన్నారు.

Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:016413